


# ఉదయం

శ్రీపతి

ద్రపోలేదు. వేకువజామునే కొన్నిసార్లు తొలికోడి కూడా కూయకముందే — కురమయ్య వచ్చి "ప్రెసిరెంటు బాపు రమ్మంతన్నాడురా, సీరాంవులు, బేగి రమ్మంతన్నాడు" అని కేకలేసి లేపుతాడు. నిద్రలో జోగుతూనే శీరాములు పదిపన్నెండేళ్ల కురమయ్యతో వెళ్లిపోతాడు.

"కూకో, మాంవా?" అంది తులసి.

విన్న రాత్రి శీరాములు "ఒంట్లోన బాగులేదు" అన్నాడు. కోడిగుడ్డు తాగమన్నాది తులసి. ఉదయం తులసి లేవకముందే శీరాములు లేచి వెళ్లిపోయాడు. రాత్రి మాట గుర్తుపెట్టుకుని కోడిగుడ్డు అట్టు చేసి ఉంచింది.

"తిండి తిన్నావా, తులసే." శీరాములు అడిగాడు.

"నీవేమో నడిరేతిరి తిరిగిన తరాతొస్తావు. నీనేమో గడపలో సూస్తాకూకోవాల. ఎప్పుడు తిండి?"

""మరి తినూ, ఏంటి పొగ!" అని తులసికి తినమని చెప్పి, ఇళ్లంతా కమ్ముకుంటున్న పొగకి విసుక్కున్నాడు.

తులసి ఇంటినించి పొగ పోవటానికి వీధి తలుపు తెరిచింది.

సత్తురేకులలో అట్టు తెచ్చి శీరాములు ముందు ఉంచింది. అట్టు రెండువేళ్లతోనూ తీసి సగం ఒకేసారి ---- "బావున్నాది కాని ఉప్పు లావయింది" అన్నాడు.

సత్తుకంచం ముందుపెట్టుకున్నది తులసి. ---- నల్లబారిన చట్టిలోని అంబలి తెడ్డుతో కంచంలో పెట్టుకుంది. కాల్చిన ఉప్పుచేపని అందుకుంది. శీరాములు వేపు తిరిగి పొయ్యి ముందే కూచుని తింటున్నది.

"జగ్గడు, సూరిగాడు, కుష్టారావు, ముకుందుగాడు సీలేరు పారిపోయినారు, ఎరికా?"

పొయంత్రం ఆ పేర్లే చెప్పి "సీలేరం పారిపోయి నారట!" అని వాళ్ల అత్తకూడా అంది.

తులసి తెలుసునవలేదు, తెలీదన్లేదు.

శీరాములుకి కూడా సీలేరు పారిపోవాలని ఉంది. అక్కడ కొలువు దొరుకుతుంది. పని తక్కువ. టయానికి వెళ్లి టయానికి రావాలి. మేస్త్రీ తిట్టడు. పెళ్లాంతో ఒకసారి "నీనుకూడా ఎలిపోతా" అన్నాడు. అప్పుడు తులసి ఏడ్చింది.

మళ్లీ ఇప్పుడు "నీనుకూడా ఎలిపోతా" అన్నాడు. అట్టు తినేసి సత్తురేకుని పెళ్లాం ముందుకు తోశాడు.

కంచంలో చెయ్యి అలాగే ఉంచేసి బాధతో చూసింది. అంతలోనే కళ్లనిండా నీళ్లు తిప్పుకుంది.

"సీ, ఏంటి ఏడుపూ. నవ్వుతాలకన్నా" అన్నాడు. "ఎత్తాం. సీ, ఏడకు" అని నవ్వాడు.

కిందటిసారి ఇట్లాగే చెబితే వెక్కివెక్కి ఏడ్చేసింది. కొలువు కుదిరినాక వచ్చి తీసుకువెళతా నన్నా ఒప్పుకోలేదు. బెంగపెట్టుకుంది. తుళ్లుతూ నవ్వే తులసి గొంతు పడిపోయేసరికి శీరాములుకి గుండె తరుక్కుపోయినట్టయింది. "ఎల్లన్లే. బెంగెట్టుకోకు" అని నచ్చజెప్పాడు. వెళదామనుకున్న ఆ జట్టువాళ్లంతా — శీరాములు తప్పించి — రాత్రి సీలేరు వెళ్లిపోయారు.


"సీ, ఎల్లను. ఎల్తే రాత్రే — పెక్కేద్దును" అన్నాడు.

తులసి నమ్మింది. కాని దానికి తిండి తరవాత సహించలేదు. పారెయ్యకూడదు పాపం అని తింటున్నది.

శీరాములుకు బాగా అలసటగా ఉంది. కూచోవటం కూడా కష్టంగా ఉంది. గోనెపట్ట బొంత అటూ ఇటూ విప్పుకుని దానిమీద ఒళ్లు వరిశాడు.

"నీ తిండి అయిపోతే లేపు" అని నిద్ర గొంతుతో చెప్పాడు.

శీరాములు తిండి ప్రెసిడెంటుగారి ఇంటి దగ్గిర. వాడికి మంచి తిండే దొరుకుతుంది. ఇంటి దగ్గిర తల్లికీ, పెళ్లానికీ మాత్రం ఇంతే. ఉప్పుచేపో, ఉల్లిపాయో నంజుకోవాలి. మొదట్లో ఒక వారం పెళ్లాం ఈ అంబలి గంజీ తాగడం, తనేమో ప్రెసిడెంటుగారి ఇంటికాడ కూరలతో తినడం — బాధపడ్డాడు. ఇప్పుడు ఆ బాధ తగ్గిపోయింది. కోడిగుడ్డు అట్టు తిన్నప్పుడు




చిత్రం—సాంబు (మద్రాసు-5)

కూడా పెళ్లానికి ఒక ముక్క ఇవ్వాలనిపించలేదు.

శీరాములు కళ్లు బరువుగా పడిపోతున్నాయి. నేల మీద చేరగిలబడడంతోనే ఒంటిలోని అవయవాలన్ని ఎక్కడివక్కడ జారిపోయాయి. హాయిగా ఉంది. సుఖంగా ఉంది.

తులసి చూసింది. మొగుడు కునుకు తీస్తున్నాడు.

వాన కురుస్తున్నది. చల్లగాలి వీస్తున్నది. పరద పారుతున్నది. చలేస్తున్నది.

పొయ్యి ఆరిపోయింది.

"సీరాంవులూ, సీరాంవులూ!" కురమయ్య గొంతు. పిలుస్తున్నాడు.

కంచం దగ్గిరవించి ఎంగిలిచేత్తోనే లేచి, గడపలోకి వచ్చి "తొంగున్నాడు. లేప కెల్ను" అని చెప్పింది. పెద్ద గొంతు చేస్తే ఎక్కడ కునుకు చెడిపోతుందో అని మెల్లిగా చెప్పింది.

"ప్రెసిరెంటు బాపు బేగి రమ్మంతన్నాడు."

"రాడాడు. తొంగున్నాడు, ఎల్ను."

"లేపి తీసికి రమ్మన్నాడు ప్రెసిరెంటు బాపు."

"ఎల్లా — ఎల్లమంతె వీక్కాదు? ఒల్లకాదని సెప్పు. ఎల్ను. ఆ ప్రెసిరెంటు బాపుకి సెప్పు. ఎల్లు" అంది. కసిరి పంపించేసింది.

కురమయ్య చిన్నవాడు. వానలో తాటి గొడుగు తలమీద టోపీలా పెట్టుకున్నాడు. వచ్చి ఎప్పుడూ శీరాముల్ని నిద్రలేపి తన వెంట తీసుకువెళ్లేవాడు నోరెత్తలేక వెళ్లిపోయాడు.

• • •

ఆ కేకలకి కూడా శీరాములకి తెలివి రాలేదు. కంచం ముందు మళ్లీ కూచున్నది. తులసికి ప్రసిడెంట్ మీద కోపం వచ్చింది. కళ్లనిండా ఒక కునుకుకూడా తీయ నివ్వరా ఎంత కడుపుకు చాలక కంబారితనం చేసి బతుకుతున్నామాత్తరం? రాతిరి పెళ్లాంతో పడుకున్నప్పుడు కూడా లేపి తీసుకెళ్తారా? తులసికి కోపం వచ్చింది.

కన్నవారింట్లో ఉన్నప్పుడు తులసి తన ఈడువాళ్లతో గొప్ప చెప్పుకునేది, తన మొగుడు ప్రసిడెంటు దగ్గిర కంబారి అని. అలా చెప్పుకుంటుంటే తులసికి ప్రసిడెంటు పద వంతటి బులుపు. ఇప్పుడు మొగుడు ఇంటికి తొందరగా రాడు. తెల్లగా తూరుపు తెల్లారిందాకా ఉండడు. కొత్త ఊరు. అత్త తిన్న వెంటనే ఎంకమ్మ దగ్గిరకి వెళ్లిపోతుంది. అప్పటినించి తులసి దిక్కులు వెతుకుతూ కూచుంటుంది. నిద్ర వస్తుంది. వెళ్లి నిద్రపోదు. గడపలో మొగుడు వచ్చేవరకు కూచుంటుంది. ఇరుగూ పొరుగూ అలికిడి లేదు. ఇంటికి ఒకరూ ఇద్దరూ ముసలీ ముతకా తప్ప ఎవ్వరూ లేరు.

ఉత్తరాంధ్రలో వరసగా మూడేళ్లనించి వర్షాలు లేవు. పంటలు చెడిపోయాయి. తరవాత పశువులకి కూడా నీళ్లు లేకపోయాయి. రైతులు పోషించలేక పశువులని అమ్ముకున్నారు. కంబార్లను వదులుకున్నారు. పనుల్లేక జనం చెట్టుకో పిట్టగా పారిపోయారు— కొందరు భిలాయ్, కొందరు కలకత్తా, కొందరు విశాఖపట్నం, కొందరు కొరాపుట్, ఇంకా కొందరు దగ్గిర దగ్గిర టౌన్లలోకి—రిక్షాలు తొక్కి బతకటానికి, కూలి పనులు వెతుక్కోటానికి, రోజూ గుక్కెడు గంజి తాగడానికి.

ప్రసిడెంట్ ఆ ఊళ్లో పెద్ద రైతు అవడం మూలాన

శీరాములుకు కంబారితనం పోలేదు. లేకపోతే వాడికి కూడా ఊరు వదిలి పారిపోవటం తప్పేదికాదు.

తిన్న కంచాన్ని, అంబలి చట్టిని కడిగేసి ఓ మూల పెట్టింది. చేపపొలుసు, ముళ్ళూ చీపురుతో పొయ్యిలోకి తుడిచేసింది. వీధి తలుపు గడియపెట్టి వచ్చింది.

జల్లులు తగ్గి వాన నిలిచి కురుస్తున్నది. తులసికి తల్లి గుర్తు వచ్చింది. వర్షం వస్తే వాళ్ల ఇల్లు కారుతుంది. ముగ్గురు పిల్లలతో తల్లి పొరుగింటికి పోయి వాళ్ల గడపలో నిద్రపోవాలి. ఎలాంటి అవస్థ పడుతున్నారో పాపం అని విచారించింది. దుఃఖమయింది.

తల్లిమీద మనసు పెట్టుకున్నప్పుడల్లా తులసికి గుండె చెరువయిపోతుంది. తండ్రి నాటు అమోనియా సారా తాగి తాగి గుండె దబ్బలు చిల్లులు పడి చచ్చిపోయాడు. ఆ చచ్చిపోయేముందు డాక్టరు వద్దకు తీసుకువెళితే మందుకోసం డబ్బు అడిగాడు. తల్లి బదులు తెచ్చిందో, ఏమమ్మిందో— తెచ్చింది. ఇంకా మందుకు డబ్బు కావలిసివచ్చింది. ఎంత మొత్తుకున్నా డబ్బు దొరకలేదు. తులసి దగ్గిర తల్లికి తెలియకుండా దాచుకున్న డబ్బు ఇరవై రూపాయలు ఉంది. కాని తనదగ్గిర ఉన్నట్టు తల్లితో చెప్పలేదు. పది రూపాయలకోసం తల్లి పట్టరానివాళ్ల కాళ్ళు పట్టింది. గిలగిల కొట్టుకుంది. తండ్రి కొనఊపిరితో గింజుకుని గింజుకుని చనిపోయాడు. కాని తులసి ఇవ్వలేదు. తండ్రిమీద పడి తల్లి గుండె బాదుకుని ఏడుస్తూంటే తులసికి బాధ అయింది. తన దగ్గిర ఉన్న డబ్బు ఇచ్చేసి ఉంటే బావుండును అనిపించింది. ఆ ఇరవై రూపాయలు తులసి అప్పు డొక పావలా ఇప్పు డొక అర్ధా మిగిల్చి దాచింది. పదిపైసలకోసం చాలా అబద్ధాలుకూడా చెప్పింది. కొన్నిసార్లు పట్టుబడిపోయి తలి చేత తిట్లూ తాపులూ తిన్నది కూడా. తాగి ఒళ్ళు మరిచి వస్తే తండ్రి దగ్గరనిలచి కూడా దొంగిలించింది. అలా కూడబెట్టింది. ఆ పైసలు ఉంచిన చోటు తులసికి తప్పించి భగవంతుడికి సయితం తెలీదు. చివరికి కాపరానికి అత్తవారింటికి వస్తున్నప్పుడు తెచ్చుకుంది. ఆ డబ్బుని ఎప్పుడు చూసినా అవి తల్లికి ఇస్తే తండ్రి బతికేవాడేమో అన్న ఆలోచన వస్తుంది. అయినా ఎంతో కాలం బతికేవాడు కాదు. చచ్చిపోయేవాడు. ఇచ్చిఉంటే తన డబ్బుమాత్రం పోయేది అనుకుంటుంది. తన సొమ్ము మిగిలినందుకు సంతోషిస్తుంది.

తొలిరాత్రి తులసి తను తెచ్చిన సంపద గురించి మొగుడుతో చెప్పింది. చాలా గర్వపడింది. ఆ ఇరవై రూపాయలతో ఒక సామ్రాజ్యమే దొరుకుతుందనుకుంది. మొగుడుని ఒక చొక్కా కుట్టించుకోమంది. జోడు కొనుక్కోమంది. గొడుగు ఒకటి తెచ్చుకోమంది. పంచెల జత తీసుకోమంది. ఒంట్లో బాగులేదంటే రోజూ కోడిగుడ్డు తాగమంది. డాక్టరు దగ్గిర ఇంజక్షన్ తీసుకోమంది.

తల్లిని గురించి బెంగపడిందల్లా ఆ సంగతి మరిచిపోయింది తులసి. మొగుడు నిద్రపోతుంటే చూసింది. లేచున్నాడుగదా అని లేపబోయింది. లేవలేదు. బోర్లా పడుకున్నాడు. తలకింద రెండు చేతులూ పెట్టుకున్నాడు. మళ్లీ లేపిచూసింది. లేవలేదు. తెలివి రాలేదు. ఆ నిద్ర చూస్తుంటే బలవంతంగా లేపకూడదనిపించింది. చలేస్తున్నట్టుందని తొలుగుమీదున్న దాని కోక తెచ్చింది. దీపం చల్లార్చి వచ్చింది. మొగుణ్ణి ఆనుకుని పడుకుంది. వాడిమీదికి ఒక కాలు వేసుకుంది. తులసి రొమ్ముకు వాడి భుజమూ వీపూ గుండే — చల్లగా తాకుతున్నాయి. వాడి మెడని ఒక చేత్తో చుట్టేసింది. చీరని ఇద్దరికి సరిపడేట్టు కప్పింది. ఆ ఒంటి వాసన బాగుంది తులసికి. ముట్టుకుంటుంటే ఒళ్ళు పులకరిస్తున్నది. ఒంటిలోని రక్తం అమృతమయిపోతున్నది. నరాల చురుకు హెచ్చుతున్నది.

బయట వాన. ఆ చప్పుడు. కప్పలూ చీకటిపిట్టలూ సందడి. ఆ సందడినించి మనిషి గొంతు. ముందు ఏమిటో ఎక్కడో అనుకుంది. తరవాత స్పష్టంగా వినిపించింది. 'శీరాములూ, శీరాములూ' అని పిలుస్తున్నాడు. పెద్ద మనిషి గొంతు. తలుపు తట్తున్నాడు. పలక్కపోతే ఇంకా గట్టిగా తలుపుమీద బాదుతాడని ముందు పలికింది. అగ్గిపెట్టె వెతికింది. దీపం వెలిగించింది. ద్వారం వద్దకి వచ్చి 'ఓరు?' అంది.

తలుపు తెరిచిందో లేదో టార్చిలైట్ కాంతి పడింది గడపలో.

"నేను మేష్టర్ని. శీరాముల్ని లేపమ్మా" అన్నాడు కొంచెం వెనక్కి తగ్గి.

"అలిసిపోయివచ్చి తొంగున్నాడు, బాబూ" అంది. మర్యాదగా మాటాడింది.

"అది కాదమ్మా. చెరువు గండిపడింది. రైతులంతా పరిగెత్తుతున్నారు—ప్రెసిడెంటు కూడా. ఒక గంట పని. లేపమ్మా" అన్నాడు. ఆ గొంతు, ఆ మాట తీరు తులసికి తెలుసును. ఇంతకుముందు రెండు మూడు సార్లు ఇలాగే రాత్రిపూటో, వేకువజామునో వచ్చి లేపుకు వెళ్లేడు. ప్రసిడెంటు ఇంట్లోనే ఎప్పుడూ ఉంటాడు.

మారు మాటాడలేదు. వచ్చి శీరాములుని పట్టుకుని కుదిపి లేపింది. "పెసిరెంటు బాబు పిలవ్తున్నారట. లెగు. చెరువు గట్టు కొట్టేసివాదట. మేష్టరుబాబు వచ్చివారు. లెగు" అని చెప్తున్నది.

నిద్రలో శీరాములుకి తులసి గొంతు వినిపిస్తున్నది. పెసిరెంటు అన్న మాట తెలుస్తున్నది. కాని ఒళ్ళు కూడ దీసుకోలేకపోతున్నాడు. కదల్లేకపోతున్నాడు. కనురెప్పలు ఎంత ప్రయత్నిస్తున్నా లేవలేకపోతున్నాయి. అలసట వస్తున్నది. అప్పటికి దూరంనించి మేష్టరు గొంతుకూడా వినిపించింది. రెండుమూడు నిమిషాలు శక్తులన్నీ ఒకటొకటే కూడదీసుకున్నాడు. చేతులతో కళ్ళు పదేపదే మలుముకున్నాడు. మసకంతా పోయి చూపు వచ్చింది. ముందున్న వస్తువులూ కనిపించాయి. లేచి పెళ్లాంతో ఏం చెప్పకుండానే వెళ్లిపోయాడు. మేష్టరు గొడుగు వెనకాల శీరాములు తాటి గొడుగుతో ముందుకు నడిచాడు.

* * *

తినకుండా ఉంటే తులసి ఎంతసేపన్నా నిద్రపోకుండా కూచోగలిగేది. కమ్ముకువస్తున్న నిద్రమబ్బుని ఆపుకుని చాలాసేపు కూచుంది. దీపంలో ఆముదం పోసి వచ్చింది. తలుపు తెరిచే ఉంచింది. గోడవారి కూచుని వాకిట్లోకి చూస్తున్నది. అట్లా చూసి చూసి తెలీకుండానే పక్కమీద వాలిపోయింది తులసి.

గండి పూడ్చిన తరవాత వచ్చాడు శీరాములు. చాలాసేపు పట్టింది. చీకట్లోనే వానలో తడిసి పని పూర్తి చేశారు. ఇంక ఎంతో రాతిరి లేదు. వాన జోరు తగ్గింది. తడిగుడ్డలతో చలికి వణికిపోతూ ఇంట్లో అడుగు పెట్టాడు. దీపం ప్రమిద కడుపులో వత్తి కాలుతున్నది. చిలకకొయ్యలకి ఆరేసిన పంచెతో ఒళ్ళంతా ఒత్తుకున్నాడు. తులసి ఒళ్ళు మరిచి నిద్రపోతున్నది. ఇంతసేపు చూసి ఇప్పుడే కునుకు పట్టినట్టున్నది. పని చేస్తున్నంతసేపూ పెళ్లాన్నే మతివేసుకున్నాడు. కనీసం తల్లినన్నా లేపి తోడుండమని చెప్పి రాలేదు. ఈసారి ప్రసిడెంట్ మీద శీరాములుకి కోపం వచ్చింది.

తులసి కాపరానికి వచ్చిందాకా శీరాములుకి ప్రసిడెంట్ అంటే తండ్రిలాంటివాడు. దేవుడులాంటివాడు. కురమయ్య అంత వయస్సునించి ప్రసిడెంటు దగ్గిరే శీరాములు కంబారిగా ఉంటున్నాడు. పనీపాటా నేర్పి

# గాంధీజీ సూక్తులు



## దురలవాటు

నిజం తెలిసినవాడు ఆ మాట చెప్పడానికి ఎందుకు భయపడతాడు? సిగ్గుపడుతున్నాడా? ఎవరిని చూసి సిగ్గుపడుతున్నాడు? అతగాడు గొప్పవాడయినా, అల్పుడయినా సంకోచించడానికి అసలు కారణ మేమిటి? యథార్థ మేమిటంటే మనం అందరము అలవాటుకి దాసులమయిపోయాము. దీన్నిగురించి ఆలోచించి ఈ దురలవాటు పోగొట్టుకోవడం చాలా మంచిది.

ఈ దురలవాటు పోగొట్టుకుంటేతప్ప, మనం సత్యపథంలో అడుగు పెట్టలేము. అంతేకాదు, ప్రతీది మనం సత్యాగ్నిహోత్రజ్వాలలో హోమం చెయ్యాలి. మనం స్వస్వరూపాలలోకాక అంతకన్న బాగా గొప్పగా కనబడాలని ఉవ్విళ్లూరుతాము. మనం అల్పులమయినట్టుగానే కనబడగలిగితే ఎంత బాగుండును? ఇలాగ ఉండగలిగితే ఎప్పటికయినా మనం ఆశించిన ఔన్నత్యం పొందగలుగుతాము.

* ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం *

కున్నాడు. ఇంట్లోని మనిషిలాగ మెలిగాడు. ప్రెసిడెంటు కూడా "ఇంటిమనిషి కంటె నమ్మకస్థుడు. ఆడికి ఈ పని చెయ్యరా అని చెప్పక్కర్లేదు. పేరుకి కంబారిగాని పెత్తనమంతా ఆడిదే. మనిషంటే నికార్సయిన మనిషి. ఒకటోరకం మనిషి" అని పొగిడేవాడు. పెళ్లాం వచ్చిన తరవాత శీరాములు ఇంటిదారి పడుతూండడం కనిపెట్టి ప్రెసిడెంట్ కోప్పడ్డాడు. "పెళ్ళామొచ్చిన తరవాత అంత మారిపోకూడదురా, శీరాములూ" అన్నాడు. "పెళ్లాం దగ్గిర కూకుంటే కూడు రాదురా. పెళ్లాలని తిని మనుషులు బతకర్రా. పెళ్లాలతో తైతక్కలాడితే కడుపు నిండదురా, శీరాములూ" అన్నాడు. ఆ మాటలు శీరాములు గుండెలో గుచ్చుకున్నాయి. అందుకే వాడు మొదటిసారి సీలేరు పారిపోవాలనుకున్నాడు.

ప్రెసిడెంటుకు ఒక కూతురుంది. ఆ పిల్లని ఎత్తుకునేప్పుడు, శీరాములు ఎత్తుకున్నాడు. శీరాములు ముందు ఆ పిల్ల గౌన్ను తొడుక్కోకుండా తిరిగింది. ఆ పిల్లకి నాలుగు నెలల కిందటే పెళ్లిచేశాడు. అల్లుడు కాలేజీ చదువు పూర్తిచేశాడు. ఉద్యోగం లేదు. పది దినాల క్రితం నించీ మామగారింటే ఉన్నాడు. ఆ వచ్చినప్పుడు ప్రెసిడెంటు మొగుడు వచ్చాడు అన్నాడు మేస్త్రరు. ఆ పిల్లా, దాని మొగుడూ ఒకళ్ల నొకళ్లు వదిలి ఉండరు. నవ్వుకుంటారు. కలిసే పొలానికి వెళ్తారు. ఏ పనీ చెయ్యరు. మళ్లీ ఇంటికి వెళ్లిపోతారు. కులుకుతారు. అలుగుతారు. గంటల తరబడి తలుపు వేసుకుని రేడియో పాటలు వినుకుంటూ గదిలో ఉంటారు. వాళ్ళని చూసినప్పుడల్లా తులసి మతి పోతుంది.

# ఆ సమయం

## మాదిరాజు రంగారావు

రావద్దు ఆ సమయం.
ఉదాసీనత ఉద్యోగం చేసే
ఆ సమయం రావద్దు.
దీనికన్న నిద్ర మంచిది.

వద్దు, కదలని శాంతి.
రాని విష హాలా క్షణం.

నిరాశ నిటారుగా నిలిచి
నింగిలో తల దూర్చి మనుష్యులు,
మనసులు పీడకలలు కనే
ఆ సమయం రావద్దు.

చేసేటి పని ఒద్దు విశ్రాంతిలో
తిరిగే వ్యక్తిని వెన్నెలలో ముంచే,
గత విషాదం జ్ఞప్తికి తెచ్చే
ఆ సమయం రావద్దు.

వ్యర్థంగా కళ్ళు పరచుకొని
దిక్కులు చూచే ఆ సమయం.

హృదయ శిల పూసిన పూలతో
దీర్ఘరాత్రి హ్రస్వమౌ వెలుగుతో
రానీ ఆ సమయం!
భగవంతుడా! రానీ! ★

ఆ అల్లుణ్ణి ప్రెసిడెంటు "పెళ్లాలతో తైతక్కలాడితే కడుపు నిండదురా! అని ఎందుకనడో పెళ్లాలని తిని మనుషులు బతకర్రా" అని ఎందుకు చెప్పడో?

కళ్ళు తెరిచినా, కళ్ళు మూసినా శీరాములుకి వాళ్లిద్దరే కనిపిస్తారు. వచ్చి రెండు వారాలయినా పెళ్లాన్ని పగటి వెలుతురులో ఇంతవరకు చూడలేదు శీరాములు. చూడాలని వారం రోజులనించి అనుకుంటూ కూడా చూడలేకపోయాడు.

కాపరానికి వచ్చిన రెండో రోజే తులసి అడిగింది, "ప్రెసిడెంటు బాబు పొలానికి పన్లోకి తీసికెళ్లవా, మావా?" అని. ఒక పగలంతా మొగుడు కనిపించక పోయేసరికి గిలగిల్లాడిపోయింది. తులసి అట్లా అడిగేసరికి శీరాములుకు గుండె తొలుచుకుపోతున్నట్టు అయింది. "ఆళ్ళ మనుషులుకారు. అటు రాకు. మొదవకి గడ్డితే. ఇంటిపన్జూసుకో. అమ్మకి తోడుండు. దానికి ఆ కాలు ఇరక్కపోతే పది మంది పని సేసేది. ఆ బగమంతుడు దాని కాలు ఇరిసినాడు" అని తల్లి కాలు నెల దినాల క్రితం విరిగిపోయినందుకు విచారించాడు. తల్లి కాలే విరక్కపోతే తులసిని ఇంత తొందరగా తెచ్చేవారుకాదు.

తులసికి మొగుడు చెప్పిందంతా అర్థమయింది. మళ్లీ ఆ తలంపే పెట్టుకోలేదు.

తడిసిపోయిన పంచె విడవటానికి పొడిపంచెకోసం పెట్టె దగ్గిరకి వచ్చాడు. తెరిచాడు. కట్టుకో బుద్ధి కాలేదు. పైన పెట్టాడు. ఇందాక ఆరేసిన పంచెనే — ఇంకా పొడిగా ఎండకపోయినా — తడితడిగా ఉన్నా దాన్నే కట్టుకున్నాడు. పెట్టె మూతపెట్టాలనుకున్నాడు. పెట్టెలోపలి అర కనిపించింది. ఆ అరలో పెళ్లాం తెచ్చిన డబ్బుంది. ఆ డబ్బు చూసినప్పుడల్లా సీలేరు గుర్తుకి వస్తుంది. అక్కడికి వెళ్లిపోయిన మనుషులంతా గుర్తుకి వస్తారు. జగ్గడు తిట్టాడు, ముందంతా వస్తానని, ఇప్పుడు పెళ్లాం ఏడుస్తున్నాదని ఉండిపోతావురా తొత్తుకొడకా అని. వాళ్లతో వెళ్లలేక పోయినందుకు వాడికి బాధగా ఉంది.

డబ్బు తీసి లెక్కపెట్టాడు. పద్దెనిమిది రూపాయలు, ఒక అర్ధరూపాయి పైన — ఒక పాతపైసా.

తులసి ఏడుస్తుంది.

తులసివేపు చూశాడు. పక్కనాటుగా పడుకుంది.

దీపం ఆరిపోతుందేమో అని వత్తి ఎగదోసి ఆముదం పోశాడు. ఆ వెలుతుర్లో మళ్లీ తులసిని చూశాడు. గుండెమీది పీర జారిపోయి కళ్లని కట్టేసి నట్టుగా తులసి కనిపిస్తున్నది. ఒక్కసారి దగ్గిరగా గుండెకి అదుముకోవాలన్నంతగా ఉద్రేకం కలిగిస్తున్నది.

ఒక చొక్కా ఉంటే దాన్నికూడా తీశాడు. తువ్వాలుంటే దాన్నీ బయట పెట్టాడు. అరలో పెద్దపైసా, ఒక అర్ధరూపాయి వదేశాడు.

దొంగలా శీరాములు పెళ్లాం తలదగ్గిర కూచున్నాడు. ముఖం మీద చెయ్యి పెట్టాడు. ముఖం పెట్టాడు. తాకబోయి మానుకున్నాడు. కదల్లేక పోయాడు. కూచున్నాడు. తెల్లారిపోతుందేమోనని భయమేస్తుంది. పెళ్లాం లేచిపోతుందేమోనని జంకు పుట్టింది. గడపలోకి వచ్చాడు. ఎక్కడో ఎవరిపక్కనో పడుకుంటే తన్ని వర్షంలోకి తోసేసిన కుక్క అరుపు వినిపిస్తున్నది: ఎవరో టార్చిలైటు వేసుకుని వీథిలోంచి పోతున్నారు.

లోపలికి వచ్చి పెళ్లాం కాళ్లదగ్గిర గోడకానుకుని కూర్చున్నాడు. మనసు ఇటూ అటూ ఊగుతున్నది. కుడిచేతిలో రూపాయలున్నాయి. మూడు పైళ్ళ

గంధర్వులు (అజంతా శిల్పం)

చిత్రం—జి. ఎస్. లత (మద్రాసు-17)





నగౌబా మొసలాలు

ఫోటో—వై. ఎల్. ఎస్. రావు (హైదరాబాదు-32)

తెల్లవారకముందు నడవాలి. తరవాత బస్సు దొరుకుతుంది. ఆ తరవాత రైలు. మళ్లీ అక్కడ దిగి బస్సు. సీలేరు కొండల్లోకి. జగ్గడు, కుష్టోరావు, సూరిగాడు అందరూ ఉన్న ఆక్కడికి.

నిద్రమబ్బు కమ్మినట్టయింది.

పొలం గట్టుమీంచి ప్రెసిడెంటు కేకవేస్తున్నాడు. పొలం బురదలో నల్లెద్దు నడవలేకపోతున్నది. ముల్లుగర్రతో పొడుస్తున్నాడు. అయినా నడవదు. పడిపోయింది. తోక విరిచినా కరిచినా లేవలేదు. ప్రెసిడెంటు పొలంలోకి దిగి ఎద్దు మెడలోని పలుపు విప్పి దాన్ని పొలంనించి తోలేశాడు. కాడికి తనని లాక్కెళ్లి కడుతున్నాడు ప్రెసిడెంటు. బలంగా లాక్కుపోతున్నాడు. రెండోపక్క దున్నెద్దు. తనొక పక్క. ప్రెసిడెంటు హేయ్ అని అరిచి కొరడా విసురుతున్నాడు. పొలంలో మోకాల్లోతున అడుసు. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంది. వెన్నుమీద ముల్లుగర్రతో పొడుస్తున్నాడు. చుట్టూ మనుషులు చూస్తున్నారు. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇదేం అన్యాయమని ఎవ్వరూ అడగరు.

కూచున్నవాడు తల వాలి పడిపోతూ తుళ్ళిపడి లేచాడు. భయంగా ఉంది. ఏమిటో అయింది. తెలీదు. అలిసిపోతున్నాడు. సర్దుకుని కూచున్నాడు. చేతిలో డబ్బు లేదు. కింద పడుంది.

డబ్బు తీసుకున్నాడు. ఉండకూడదు. వెళ్లిపోవాలి. ప్రెసిడెంట్ తినేస్తాడు. తిడతాడు. పొడుస్తాడు. పెళ్లాన్ని చూడనివ్వడు. ఇక్కడ పెళ్లానికి తిండి లేకుంటే ఇంకేం పెట్టలేడు. ప్రెసిడెంటు అప్పు తీరదు. పారిపోవాలి. ఈ డబ్బు ఖర్చయిపోతే టిక్కెట్టుకు కూడా మరి పైసా దొరకదు. తులసి లేకుండానే వెళ్లిపోవాలి. చొక్కా తువ్వాలూ వంచె మూట కట్టాడు. ఆ మూటలో డబ్బు పెట్టాడు.

చలివేస్తున్నది. ఒళ్లంతా పచ్చి పుండులా ఉన్నది. తులసిని లాక్కుని పడుకుంటే ఎంతో సుఖంగా ఉంటుందనిపిస్తున్నది. కాని ఈ యమలోకం నించి బయట పడలేడు.

మూటని గుండెకానించి పట్టుకున్నాడు శిరాములు. పెళ్లాన్ని మరోకసారి చూశాడు. అమాంతం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అయినా ఆగలేదు. వీధిలోకి వచ్చాడు. వాన లేదు. ఆకాశాన్ని చూశాడు. అక్కడా అక్కడా తెల్లటి మేఘా లున్నాయి. నిండా చుక్కలు కనిపిస్తున్నాయి.

పాదాలు మునుగుతున్న లోతున పారుతున్న నీటిలో అడుగులు వేసుకుంటూ ముందుకు నడిచాడు శిరాములు. నీళ్లల్లో అడుగుల చప్పుడవుతున్నది. వీధిలోంచి వెళ్లకూడదనుకుని దారి మార్చాడు.

తాటి కమ్మ గొడుగు పట్టుకోవడం మరిచినందుకు నాలిక కరుచుకున్నాడు. వెనక్కి అడుగు వేస్తే అనుకున్న పని నెరవేరదని వాడికి ఎక్కడలేని నమ్మకం. వాన వచ్చే లోపల బస్సుస్టాండుకి వెళ్లిపోవచ్చునే అన్న ధీమా కలిగింది. మేఘాలని చూసి వానకూడా రాదులే అనుకున్నాడు. బస్సు తప్పిపోకూడదని అంగలు సాచి నడిచాడు శిరాములు.

★